క్లుప్తంగా

గుడుంబా తయారీదారుడిపై కేసు

తిర్యాణి: గుడుంబా తయారు చేస్తూ పట్టుబడిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీగల మాధవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం పక్కా సమాచారం మేరకు మండలంలోని చింతపెల్లి గ్రామానికి చెందిన కోలా పున్నం గౌడ్ ఇంటిలో గుడుంబా తయారు చేస్తూ.. పట్టుబడ్డాడు. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు చేపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

క్రీడలతో స్నేహభావం


పోటీలు ప్రారంభిస్తున్న అర్షద్ హుస్సేన్

బెజ్జూర్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని కాంగ్రెస్ టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం మండలంలోని సోమిని గ్రామంలో నిర్వహిస్తున్న కుమురం భీం వాలీబాల్ పోటీలను మాజీ జెడ్పీటీసీ పంద్రం పుష్పలతతో కలిసి ప్రారంభిచారు. క్రీడలతో యువత శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కుర్సింగ ఓంప్రకాష్, ఆత్రం సాయి, ఎలాది శేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

బెజ్జూర్: మండలంలోని కుంటలమానేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చాకటి విజయ్ అత్తమ్మ ఆత్రం భీంబాయి శనివారం రాత్రి మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆదివారం వారి నివాసానికి చేరికొని, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించారు.

వర్షం కురవాలని పూజలు


పూజలు చేస్తున్న గ్రామస్తులు

బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామంతో పాటు ముంజంపల్లి, సలుగుపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఆదివారం బెజ్జూర్, పెంచికల్‌పేట్ రేంజ్ పరిధి మధ్యలోని సిద్దేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు కురిసి తమ పాడి పంటలు పండాలని మేకలు, కోళ్లు బలి ఇచ్చారు. కార్యక్రమంలో చిన్న సిద్దాపూర్ గ్రామస్తులు సెండే శంకర్, కొట్రంగి లింగయ్య, కవుడే గోపాల్ కృష్ణ, భీంరావు, శ్రీనివాస్, శంరావు గణపతి పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడి

చింతలమానెపల్లి: మండలంలోని రణవెల్లి గ్రామంలో నాటుసారా తయారీ కేంద్రాలపై ఆదివారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. దాడులలో పట్టుబడ్డ ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. లకావత్ లక్ష్మి వద్ద 15లీటర్ల నాటుసారా, జాటోత్ జెత్యా అనే వ్యక్తి వద్ద 20 లీటర్ల నాటుసారా పట్టుబడగా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై వేరువేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సభ్యత్వ నమోదు పకడ్బందీగా చేపట్టాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

పెంచికల్‌పేట్: బూత్ స్థాయిలో బీజేపీ సభ్యత్వ నమోదు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాన్ని గడప గడపకూ ప్రచారం చేయాలన్నారు. అలాగే క్రియాశీల సభ్యత్వాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్, నియోజకవర్గ కన్వీనర్ వీరభద్రచారి, తదితరులు పాల్గొన్నారు.




అందాల ఎర్రవాగు..

దహెగాం మండలంలోని గెర్రె, గిరవెల్లి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న ఎర్రవాగు అందాలు చూపరులను ఆకట్టుకుంటుంది. ఉదయం ఒకవైపు సూర్యుడు ఉదయిస్తుండగా.. మరోవైపు మంచు కురిసే సమయంలో వాగు పరిసరాలు కనువిందు చేస్తున్నాయి. ఈ దృశ్యాలను సాక్షి క్లిక్‌మనిపించింది. – దహెగాం

యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా

- పెంచికల్‌పేట్ మీదుగా ఇతర ప్రాంతాలకు..
- పోలీస్‌లు దాడులు చేస్తున్నా.. ఆగని రవాణా
- వారం రోజుల్లో 185 పశువుల పట్టివేత


లారీలో పశువులను తరలిస్తున్న దృశ్యం (ఫైల్)


పోలీసుల అదుపులో అక్రమార్కులు (ఫైల్)

పెంచికల్‌పేట్: పోలీసులు దాడులు చేస్తూ.. పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపైన కేసులను నమోదు చేస్తున్నా.. పశువుల అక్రమ రవాణా మాత్రం ఎక్కడ ఆగడం లేదు. పది రోజుల్లో పెంచికల్‌పేట్ మండలం మీదుగా హైదరాబాద్‌కు నాలుగు లారీలు, నాలుగు బొలెరో వాహనాల్లో తరలిస్తున్న 185 పశువులను పోలీసులు పట్టుకుని కాగజ్‌నగర్ గోశాలకు తరలించారు. పశువులను తరలిస్తున్న క్రమంలో రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రాణాలను కోల్పోతున్నాయి. అక్రమ రవాణా చేస్తున్న జంతు సంరక్షణ చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తున్నా.. అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు.

పెంచికల్‌పేట్ మీదుగా..

మహారాష్ట్ర నుంచి పశువులను అక్రమంగా తరలించడానికి ముఠా పెంచికల్‌పేట్ మార్గాన్ని ఎంచుకున్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి ప్రాంతంలో కొనుగోలు చేసిన పశువులను చింతలమానెపల్లి మండలంలోని గూడెం వద్ద నుంచి తెలంగాణలోకి ప్రవేశిస్తున్నారు. గూడెం, చింతలమానెపల్లి, సులుగపల్లి, పెంచికల్‌పేట్, దహెగాం మీదుగా మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లిలోకి యథేచ్ఛగా ప్రవేశిస్తున్నారు. 90 కిలోమీటర్ల దూరంలో ఎలాంటి చెక్‌పోస్టులు లేనందున అక్రమ రవాణాదారులకు వరంగా మారింది. ఆయామార్గల్లో పోలీస్‌స్టేషన్‌లు రోడ్డు పక్కన లేకపోవడంతో అక్రమ రవాణా కోసం సులువైన మార్గాన్ని ముఠా ఎంచుకుంది. పక్కా సమాచారంతో పోలీసులు దాడులను చేస్తూ పశువుల అక్రమ రవాణాపైన ఉక్కు పాదం మోపుతున్నా.. అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు.

గ్రామాల్లో కొనుగోలు..

హైదరాబాద్, కరీంనగర్ పట్టణాలకు చెందిన కొంత మంది వ్యాపారులు గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని తక్కువ ధరకు పశువులను కొనుగోలు చేస్తున్నారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన పశువులను ఎలాంటి పత్రాలు లేకుండా రాత్రి పూట బొలెరో వాహనాల్లో ఇతర ప్రాంతాల్లోని సంతలకు, కోబఖాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పశువులు అక్రమ రవాణా జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ రవాణా ఉపేక్షించం



గ్రామాల్లో అక్రమంగా పశువులను కొనుగోలు చేసిన, ఎలాంటి అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లోని పశువులను తరలిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. అక్రమ రవాణాదారులపైన కేసులు నమోదు చేస్తాం. – కొమురయ్య, ఎస్సై, పెంచికల్‌పేట్

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు


తారకరామానగర్‌లో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


వాసవీ మందిరంలో మహిళలు


కేశవనాథ ఆలయంలో స్వామి వారి మూల విరాట్


పూజలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆలయాలు, దుర్గామాత మంటపాలు వద్ద భక్తులతో సందడి కనిపిస్తుంది. జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అర్చకులు నరేశ్ శర్మ ఆధ్వర్యంలో ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు భజనలు నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి స్వామి వారిని ప్రత్యేక వాహనాల్లో ఊరేగింపు నిర్వహించనున్నారు. మంగళవారం పల్లకి వాహనం, బుధవారం పొన్నచెట్టు వాహనం, గురువారం రథ వాహనం, శుక్రవారం ఏనుగు వాహనంపై స్వామి వారిని ఊరేగించనున్నారు.

మంటపాల వద్ద ప్రత్యేక పూజలు..

శరన్నవరాత్రులు పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఆలయాలు, మంటపాల వద్ద నెలకొల్పిన శారదా, దుర్గామాత విగ్రహాల వద్ద ప్రతీ రోజు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నవరాత్రుల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరం, గాంధీ చౌక్, బాపూనగర్‌లో అర్చకులు రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తారకరామానగర్‌లోని దుర్గామాత మంటపం వద్ద మహిళలు కుంకుమ పూజా చేశారు.

రెబ్బెన: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి ఆలయంలో అమ్మవారిని తహసీల్దార్ రామ్మోహన్‌రావు దంపతులు, బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు. ఇందిరానగర్‌లోని అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

ధర్నా విజయవంతం చేయండి


మాట్లాడుతున్న యువజన అధ్యక్షుడు సతీష్

బెజ్జూర్: జైనూర్ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, దీన్ని నిరసిస్తూ సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ కొలవార్ మన్నేవార్ సేవా సంఘం మండల యువజన అధ్యక్షుడు మెడి సతీష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో మాట్లాడారు. జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై హత్యాచార, హత్యయత్నానికి పాల్పడిన వ్యక్తితో పాటు జైనూర్‌లో 1950 తర్వాత వలస వచ్చిన వారిపై చర్యలు తీసుకునేందుకు, 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కొలవార్ జిల్లా సహాయ కార్యదర్శి పోల్క వెంకటేశ్, మాడవి పుల్లయ్య, మానేపెల్లి వెంకటేశ్, నాయిని మారుతి, మేకల గొంతు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తాం


మాట్లాడుతున్న అంజనేయులు

కాగజ్‌నగర్ రూరల్: జిల్లా సంఘానికి అనుబంధంగా త్వరలోనే పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని పద్మశాలి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు అన్నారు. ఆదివారం పట్టణ పద్మశాలి భవనంలో మాట్లాడారు. పద్మశాలి కులస్తులు ఎవరూ కూడా అయోమయానికి గురికావద్దని, త్వరలోనే పద్మశాలి అధ్యక్ష, కార్యదర్శుల పదవీకాలం ముగుస్తున్నందున సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. పట్టణ, జిల్లా, రాష్ట్ర,అఖిల భారత సంఘాలు అనుసంధానంగా కొనసాగుతాయన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకయ్య, పట్టణ అధ్యక్షుడు కుడిక్యాల రాజమౌళి, ప్రధాన కార్యదర్శి కేదారి, సిందం చంద్రయ్య, రాజయ్య, సత్యనారాయణ, సురవర్ధన్, శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాతో అనుబంధం మరువలేనిది


డీఈవో అశోక్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాతో అనుబంధం మరువలేనిదని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆదివారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అశోక్ మాట్లాడుతూ జిల్లాలో మూడు సంవత్సరాలపాటు పనిచేసిన అనుభవం జీవితాంతం గుర్తుపెట్టుకుంటానన్నారు. ఉపాధ్యాయులను ప్రజలను ప్రోత్సహిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని గ్రహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతంగా పేరున్న జిల్లాను విద్యాపరంగా ముందుంచేందుకు ఉపాధ్యాయులు అంకితభావం కృషి చేయాలని కోరారు. ఎఫ్ఏవో దేవాజీ, ఏసీవో ఉదయ్‌బాబు, ఆశ్రమ ఏసీఎంవో ఉద్దవ్, డీఎస్‌వో మీనారెడ్డి, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అటవీ భూమి సాగు చేస్తున్న 8 మందికి రిమాండ్

చింతలమానెపల్లి: అటవీ భూమిలో సాగు చేస్తున్న 8 మందిని శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి హైమావతి తెలిపారు. ఖర్జెల్లి రేంజ్ పరిధిలోని కోర్సిని బీట్‌లో అటవీ భూమిలో సాగు చేస్తున్న సునీల్, చంద్రగిరి రాజేశ్, ఎలుపుల శంకర్, అట్టెల రమేష్, ఎల్పుల సత్తయ్య, బొల్లబోయిన యాదవ్, నర్మలె యాదవ్, పోర్శెట్టి వెంకటేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. సిర్పూర్(టి) కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి 14రోజుల రిమాండ్ విధించినట్లు వివరించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఎంపీడీవో

సిర్పూర్(టి): ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను ట్రాక్టరుతో తొలగించారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన సూచించారు.

పాఠశాలలో మరమ్మతులు


ఫ్యాన్ బిగిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని సిర్పూర్(టి) ప్రభుత్వ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మరమ్మతులు పనులు చేపటినట్లు పాఠశాల హెచ్ఎం నవీందర్ ఆదివారం తెలిపారు. గత నెల 30వ తేదీన హాస్టల్‌లో నిద్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పాఠశాలలో రాత్రి బస చేశారని, ఆ సమయంలో పాఠశాల వసతి గృహ పరిసరాలు, గదులు, సౌకర్యాలను పరిశీలించి పాఠశాల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో మరమ్మతులు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

సిరులు తెచ్చే 'తెల్ల బంగారం'

- జిల్లాలో భారీగా పత్తి సాగు
- నేడు ప్రపంచ కాటన్ దినోత్సవం



చింతలమానెపల్లి(సిర్పూర్): పత్తి సాగులో దిగుబడిగా వచ్చే టన్ను పత్తితో సగటున ఐదుగురికి ఏడాది పొడవునా ఉపాధి లభిస్తుందని చెబుతుంటారు. ఇది వాణిజ్య పంట.. పత్తి ప్రత్యేకతను చాటుతోంది. సాగునీటి సౌకర్యం అంతగా లేని జిల్లా రైతులకు పత్తి పంట సిరులు కురిపిస్తోంది. పత్తి ప్రత్యేకతను తెలియజేసేందుకు ఏటా అక్టోబర్ 7న ప్రపంచ పత్తి దినోత్సవం నిర్వహిస్తున్నారు. పత్తిని కేవలం వస్త్రాల తయారీకే కాకుండా ఆహార ఉత్పత్తులకు సైతం వాడుతున్నారు. విత్తనం నుంచి వంట నూనె తీయడంతోపాటు పశుగ్రాసంగా విక్రయించవచ్చు.

అధికారికంగా గుర్తింపు..

ప్రపంచ పత్తి దినోత్సవం ఆలోచన 2019లో పుట్టింది. ఆఫ్రికా ఖండంలోని సహారా- సబ్‌లో కాటన్-4గా పిలుచుకునే నలుగురు ఉత్పత్తిదారులు బెనిన్, బుర్కినా ఫాసో, చాడ్, మాలి చొరవతో ఇది ప్రారంభమైంది. ప్రపంచ వాణిజ్య సంస్థ అక్టోబర్ 7న పత్తి దినోత్సవం నిర్వహించాలని ప్రతిపాదించింది. 2021 నుంచి ఐక్యరాజ్యసమితి సైతం అధికారికంగా గుర్తించింది. ప్రపంచ పత్తి దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్య సమితి ఏజెన్సీలు లక్ష్యాలు విధించుకున్నాయి. మార్కెట్ స్థిరంగా ఉంచడంతోపాటు ఉత్పాదకతను పెంచేందుకు కృషి చేస్తున్నాయి.

పత్తిదే అగ్రస్థానం..

రాష్ట్రంలో పత్తి పంట అధికంగా సాగుచేసే ప్రాంతాల్లో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఒకటి. జిల్లాలో 4.40 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు ఉంది. ఇందులో 3 లక్షలకు పైగా ఎకరాల్లో పత్తిపంటే సాగు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించని సమయాల్లో మినహా ఇక్కడి రైతులు పత్తి సాగుతో లాభాలు గడిస్తున్నారు. ఏటా సాగు విస్తీర్ణం పెరగడమే దీనికి నిదర్శనం. గతంలో ఆదిలాబాద్, వరంగల్, జమ్మికుంట, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు పంటలను తరలించి విక్రయించేవారు. ప్రస్తుతం మన జిల్లాలోనే 20కి పైగా జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. పంట ఆశాజనకంగా ఉండగా దిగుబడి గణనీయంగా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 17 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్ల కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అవగాహన పెరుగుతుండటంతో రైతులు కొత్త రకం వంగడాలను సాగు చేస్తున్నారు.

పర్ణశాల సెట్టింగ్‌లో దుర్గామాత



పర్ణశాల సెట్టింగ్‌తో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం ఆకట్టుకుంటోంది. మండలంలోని భట్‌పల్లిలో శ్రీదుర్గా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత సెట్టింగ్ చూడముచ్చటగా ఉంది. గత 22 ఏళ్లుగా దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నామని, ఈసారి పర్ణశాల సెట్టింగ్‌లో ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. – కాగజ్‌నగర్‌రూరల్

ఘనంగా బతుకమ్మ సంబురాలు


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రెబ్బెన: మండలంలోని ఆయా గ్రామాల్లో బతుకమ్మ సంబురాలను మహిళలు ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ప్రధాన కూడళ్ల వద్ద ఆడిపాడారు. మండల కేంద్రంతో పాటు గంగాపూర్, గోలేటి, నంబాల, ఇందిరానగర్, నారాయణపూర్ గ్రామాల్లో మహిళలు బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు.